సాక్షి ప్రకాశం

ఆదివారం । 2 । ఫిబ్రవరి । 2025



ఐదు కోట్ల స్థలం హాంఫట్

ఒంగోలు నగరంలో రూ.5 కోట్ల విలువైన 1.36 ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని టీడీపీ నాయకులు ఆక్రమించారు. ప్లాట్లు చేసి విక్రయించారు. - IIలో..



పేద విద్యార్థుల జీవితాలతో కూటమి చెలగాటం

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించకుండా కూటమి ప్రభుత్వం చెలగాటమాడుతోందని ఒంగోలు వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్ రవిబాబు అన్నారు. - IIలో..

వాతావరణం

గరిష్టం/కనిష్టం 32/23

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. పొగమంచు కురుస్తుంది. రాత్రి చలిగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

5న 'ఫీజుపోరు'ను జయప్రదం చేయండి

● మాజీ మంత్రి ఆదిమూలపు సురేష్



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సురేష్

సింగరాయకొండ: వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో ఈనెల 5వ తేదీ నిర్వహించే ఫీజుపోరు కార్యక్రమాన్ని విద్యార్థులు, తల్లిదండ్రులు అధిక సంఖ్యలో కదిలి వచ్చి జయప్రదం చేయాలని పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి, పీఏసీ సభ్యుడు, మాజీ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ విజ్ఞప్తి చేశారు. మండల కేంద్రంలోని వైఎస్సార్‌సీపీ క్యాంపు కార్యాలయంలో శనివారం వైఎస్సార్ సీపీ ఫీజు పోరు గోడపత్రికను ఆయన ఆవిష్కరించారు. డాక్టర్ సురేష్ మాట్లాడుతూ ఫీజు రీయింబర్స్‌మెంట్, వసతి దీవెన బకాయిలు రూ.3,900 కోట్లను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల సమస్య పరిష్కారం అయ్యే వరకు పోరుబాట కొనసాగిస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కార్యక్రమంలో జరుగుమల్లి మండల కన్వీనర్ బత్తిన మనోహర్, జేసీఎస్ కన్వీనర్ తాటికొండ రామచంద్రరావు, మసనం వెంకట్రావు, పిన్నిక శ్రీనివాసులు, నాగినేని భాస్కర్, దగ్గుమాటి శంకరరెడ్డి, కొమ్మాలపాటి మధు, చుండి శ్రీనివాసులు, చుండూరి సురేష్, చొప్పర శివ, ఫాస్టర్ అశోక్, వాసా నారాయణరెడ్డి, పీవీ రెడ్డి, ఎం శంకర్, నూకసాని ప్రసాద్ పాల్గొన్నారు.

మార్చి 3 నుంచి ఇంటర్మీడియెట్ పబ్లిక్ పరీక్షలు

ఒంగోలు సిటీ: ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యా పీఠం ఆదేశాల మేరకు మార్చి 3వ తేదీ నుంచి 15వ తేదీ వరకు ఇంటర్మీడియెట్ పబ్లిక్ పరీక్షలు నిర్వహించనున్నట్లు అసిస్టెంట్ కమిషనర్ కె.శివకుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 3వ తేదీ ఇంగ్లిష్, 5న హిందీ, తెలుగు, ఉర్దూ పరీక్షలు, 7న రసాయనశాస్త్రం, ఆర్థిక శాస్త్రం, సామాజిక శాస్త్రం, 10న భౌతిక శాస్త్రం, రాజనీతిశాస్త్రం/పౌరశాస్త్రం, మనోవిజ్ఞాన శాస్త్రం పరీక్షలు, 12న గణితం, చరిత్ర, వ్యాపార గణకశాస్త్రం, 15న జీవశాస్త్రం, వాణిజ్య/వ్యాపారశాస్త్రం, గృహవిజ్ఞాన శాస్త్రం పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ పరీక్షలు ఆయా తేదీల్లో ఉదయం 9 నుంచి 12 గంటల వరకు నిర్వహిస్తారని చెప్పారు.

పింఛన్ నగదుతో ఆచూకీ లేని సచివాలయ ఉద్యోగి

మార్కాపురం టౌన్: మార్కాపురంలోని మున్సిపల్ కార్యాలయం పరిధిలో పనిచేస్తున్న సచివాలయం ఎమినిటీ సెక్రెటరీ పింఛన్ నగదు తీసుకుని లబ్ధిదారులకు పంచకుండా ఆచూకీ తెలియకుండా వెళ్లిన సంఘటన శనివారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే పట్టణంలోని 18వ సచివాలయంలో వార్డు ఎమినిటీ సెక్రెటరీగా పనిచేస్తున్న పి.వెంకటేశ్వర్లు వార్డులోని ప్రజలకు పంపిణీ చేయాల్సిన పింఛన్ నగదు సుమారు రూ.2.66 లక్షలను శుక్రవారం తీసుకున్నారు. అయితే శనివారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు కూడా వార్డులోని ప్రజలకు పింఛన్ నగదు పంపిణీ చేయకపోగా ఫోన్ కూడా అందుబాటులో లేకపోవటంతో మున్సిపల్ అధికారులు ఆరాతీశారు. కమిషనర్ నారాయణరావుకు కూడా స్పందించకపోవటంతో పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

కరుణించని సీతమ్మ..

కరువు నిధులు సున్నా..!

కేంద్ర ప్రభుత్వం శనివారం ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై జిల్లా వాసులు పెదవి విరుస్తున్నారు. మధ్య తరగతి వేతన జీవులకు కొంత ఊరట కలిగించినా మిగతా వర్గాలు తమకు ఒరిగిందేమీ లేదంటూ విమర్శిస్తున్నారు. జిల్లాలో ఉన్న కేంద్ర ప్రభుత్వ సంస్థ నిమ్జ్ ప్రస్తావనే లేదు. గతంలో విశాఖ– చెన్నై పారిశ్రామిక కారిడార్ ప్రకటించినా ఇంత వరకూ అది ఏ దశలో ఉందో కూడా తెలియని పరిస్థితి. గత బడ్జెట్‌లో జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించినా ఆ నిధులు విడుదల కాలేదు. మొత్తంగా కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్ నిరాశ పర్చింది.



- కేంద్ర బడ్జెట్‌పై మిశ్రమ స్పందన
- వేతన జీవులకు ఊరట తప్ప ఏమీలేదు
- నిమ్జ్, దొనకొండ ఇండస్ట్రియల్ హబ్‌ల ప్రస్తావనే లేదు..
- నిత్యావసర వస్తువుల తగ్గుదల, నిరుద్యోగుల ఊసే లేకపోవడంపై విమర్శలు
- కరువు నిధులు ప్రకటనలకే పరిమితం

ఒంగోలు సాక్షి ప్రతినిధి/ఒంగోలు అర్బన్/ఒంగోలు సిటీ: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 2025–26 బడ్జెట్‌లో మధ్య తరగతి వేతన జీవులకు కొంత మేరకు మేలు జరిగినా, పేద ప్రజలు, కార్మికులు, నిరుద్యోగులకు సంబంధించిన ఊసే లేకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. జిల్లా వ్యాప్తంగా అన్ని శాఖల్లో కలిపి 25 వేల మంది ఉద్యోగులు ఉన్నారు. వారిలో 15 వేల మందికి పన్ను రాయితీ లభించనుంది. అలాగే 1.5 లక్షల మంది పన్ను చెల్లింపుదారులు ఉంటే అందులో 60 శాతం మందికి ఊరట కలుగనుంది. రూ.12 లక్షల వేతన ఆదాయంపై పన్ను మినహాయింపుపై ఉద్యోగ సంఘాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి. పన్ను విధానంలో శ్లాబు పద్ధతి ఏర్పాటు చేయడంతో మధ్య తరగతి, ఎగువ మధ్య తరగతి ప్రజలకు కొంత మేరకు ఊరట లభించింది. అయితే ఇక్కడ కూడా పన్ను చెల్లింపుల్లోకి ఎక్కువ మంది ప్రజలను తీసుకురావాలనే కేంద్ర ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందని, ఇవే శ్లాబులు ఉంటాయా లేక వచ్చే బడ్జెట్‌లో ఇప్పుడు ఉంచిన ఏడు శ్లాబులు తీసి తగ్గిస్తారా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఎంఎస్‌ఎంఈ (సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు)కు సంబంధించి ప్రకటించిన ప్రోత్సాహకాలపై హర్షం వ్యక్తం అవుతోంది. మొత్తం మీద 2025–26 బడ్జెట్‌ను పరిశీలిస్తే జిల్లాకు ఒరిగిందేమీ లేదని మండిపడుతున్నారు. కిసాన్ క్రెడిట్ పరిమితిని రూ. 3 లక్షలు నుంచి 5 లక్షల వరకూ పెంచుతూ ప్రకటించినా చిన్న, సన్నకారు రైతులకు ఎలాంటి ప్రయోజనం ఉండదని రైతు సంఘాల నాయకులు విమర్శిస్తున్నారు. ఇప్పటి వరకు ఉన్న రుణాలు రద్దు చేయాలని డిమాండ్ చేస్తుంటే రుణ పరిమితి పెంచడం సరికాదని మండిపడుతున్నారు.

కరువు నిధులు ఎక్కడ..

గత ఏడాది జూలైలో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో జిల్లాను కరువు ప్రాంతంగా కేంద్రం ప్రకటించింది. అయితే ఇంత వరకూ నిధులు విడుదల చేయలేదు. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని అసలు ఆ నిధులు వస్తాయా అన్న అనుమానం వ్యక్తమైంది. నేడు అదే నిజమైంది. గత బడ్జెట్‌లో కరువు జిల్లా ప్రకటన వెలువడిన తరువాత కూటమి నేతలు చేసిన హంగామా అంతా ఇంతా కాదు. నిధులు తెచ్చే విషయంలో ఆ శ్రద్ధ చూపలేదన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. గతంలో కూడా రాష్ట్రంలో ఏడు జిల్లాలను కరువు ప్రాంతాలుగా గుర్తించి రూ.350 కోట్లు కేటాయించింది. అయితే నిధులు ఖర్చు చేయకుండా వెనక్కు తీసుకుంది. ఇక జిల్లాకు రూ.50 కోట్ల కరువు నిధులు జిల్లాకు వచ్చేది అనుమానమేనన్న అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది.

నిమ్జ్ వచ్చేనా..!

నిమ్జ్ వస్తుందా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కనిగిరి నియోజకవర్గంలోని పామూరు, పీసీపల్లి, బోడవాడ, అయ్యన్న కోట తదితర 5 గ్రామాల్లో 14 వేల ఎకరాల భూమిని సేకరించేందుకు హంగామా చేసింది. కొంత భూమిని కూడా సేకరించింది. ఇక కనిగిరి ప్రాంతానికి కేంద్రం నుంచి పెద్ద ఎత్తున పెట్టుబడులు తెచ్చి ఉత్పత్తులు ప్రారంభిస్తామని నమ్మబలికింది. వెనకబడిన కనిగిరి ప్రాంతం పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతుందని అంతా భావించారు. అయితే అక్కడ నిమ్జ్ అనే బోర్డు మాత్రమే దిష్టి బొమ్మలా మిగిలిపోయింది. ఈ బడ్జెట్‌లోనైనా నిధుల కేటాయింపులు ఉంటాయని భావించారు. ఎప్పటిలాగే మొండిచేయే మిగిలింది.


రాష్ట్రానికి బడ్జెట్ కేటాయింపు ఆశాజనకంగా లేదు



వికసిత్ భారత్‌ను దృష్టిలో ఉంచుకుని జీడీపీ పెంచేందుకు వ్యవసాయ రంగానికి, ఉత్పాదక రంగానికి ప్రాముఖ్యత ఇవ్వడం మంచిదే కానీ రాష్ట్రానికి సంబంధించి కేటాయించిన బడ్జెట్ మాత్రం ఆశాజనకంగా లేదు. పన్ను రాయితీ, శ్లాబ్ పద్ధతి వల్ల ఉద్యోగులు, మధ్య తరగతి ప్రజలకు భారీగా ఊరట లభించినా బడ్జెట్‌లో నిత్యవసర సరుకుల తగ్గుదలపై అనుకున్నంత ప్రాముఖ్యత లేకపోవడం బాధాకరం. మొత్తం మీద నిర్దేశిత లక్ష్యాల కోసం ప్రో యాక్టివ్ బడ్జెట్‌లా ఉంది. బడ్జెట్‌పై పార్లమెంట్లో జరిగే చర్చలో రాజకీయాలకు అతీతంగా అందరూ ప్రజా ప్రతినిధులు మన రాష్ట్రానికి మరింత మెరుగైన కేటాయింపులు జరిగేలా చర్చించాలి.


– ఎం నాగేశ్వరరావు, చైర్మన్, రాష్ట్ర వినియోగదారుల సంఘాల సమాఖ్య

వెలిగొండ..దొనకొండకు ఒట్టి చేతులే..



వెలిగొండ ప్రాజెక్టు టన్నెల్

విభజిత ఆంధ్రప్రదేశ్‌కు దొనకొండ రాజధాని కావాల్సి ఉంది. అప్పటి చంద్రబాబు ప్రభుత్వం అమరావతిని ఎంపిక చేసింది. దానికి బదులుగా దొనకొండను పారిశ్రామిక కారిడార్‌గా అభివృద్ధి చేస్తామంటూ హామీ ఇచ్చింది. నాటి హామీ ఏళ్ల గడుస్తున్నా నేటికీ నెరవేరలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఇక్కడ ఎయిర్ పోర్టును ఏర్పాటు చేస్తామంటూ హడావుడి చేసింది. జిల్లా ఉన్నతాధికారులు సైతం పర్యటనలు చేసి నివేదికలు సిద్ధం చేశారు. విమానాశ్రయం వస్తే ఈ ప్రాంతం అభివృద్ధి చెందుతుందని, పారిశ్రామిక రంగానికి మంచిరోజుల వస్తాయని ఈ ప్రాంత వాసులు ఆశపడ్డారు. అయితే తాజాగా ఎయిర్ పోర్టును ఇక్కడ నుంచి కొత్తపట్నం మండలం అలూరు–అల్లూరు మధ్యలో ఏర్పాటుకు స్థల పరిశీలన చేశారు. దీంతో పారిశ్రామికవాడ కూడా ప్రశ్నార్థకంగా మారింది. అలాగే గత బడ్జెట్‌లో విశాఖ–చెన్నై పారిశ్రామిక నోడ్ అంటూ నిర్మలా సీతారామన్ ఘనంగా ప్రకటించారు. అయితే అది ఇప్పుడు ఏదశలో ఉందో కూడా తెలియని పరిస్థితి. ఇక జిల్లా అభివృద్ధికి జీవనాధారం లాంటి పూల సుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టును పట్టించుకున్న పాపాన పోలేదు. ఈ ప్రాజెక్టు పూర్తి చేయాలంటే అంతకంటే ముందుగా నిర్వాసితులకు న్యాయం చేయాలి. ఇప్పటి లెక్కల ప్రకారమే నిర్వాసితులకు న్యాయం చేయడానికి కనీసం రూ.2 వేల కోట్లు అవసరం. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాష్ట్ర మంత్రులు పర్యటించి హంగామా చేశారు. అయితే కేంద్రం నుంచి నిధులు తెచ్చే విషయంలో ఆ శ్రద్ధ చూపించలేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.



దొనకొండలోని పాత ఎయిర్‌డోం

విభజన హామీలకు నిధులేవీ..



ఈ బడ్జెట్ పూర్తిగా కార్పొరేట్ వ్యక్తులకు అనుకూలమైనది. రూ.50.66 లక్షల కోట్ల బడ్జెట్‌లో రైతాంగానికి ఎటువంటి హామీ దక్కలేదు. రాష్ట్రానికి విభజన హామీలకు సంబంధించిన బడ్జెట్‌లో నిధులు విడుదల చేయకపోవడం దారుణం. విశాఖ ఉక్కు పరిశ్రమ, ఆంధ్రప్రదేశ్ రాజధాని అభివృద్ధికి బడ్జెట్‌లో నిధులు కేటాయించలేదు. మొత్తం బడ్జెట్‌లో నిరుద్యోగం గురించి ఒక మాట కూడా మాట్లాడలేదు. పారిశ్రామిక కారిడార్‌లు, ఇతర మౌలిక వసతుల కల్పనకు సంబంధించి ఎటువంటి ప్రకటన చేయలేదు.

– చిట్టిపాటి వెంకటేశ్వర్లు, సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ రాష్ట్ర అధికార ప్రతినిధి

వెనుకబడిన జిల్లాలకు నిధులేవీ..



గతంలో వెనుకబడిన జిల్లాల జాబితాలో ప్రకాశం జిల్లాను చేరుస్తున్నట్లు చెప్పినా.. ఆమేరకు నిధులు ఇవ్వలేదు. ఇది కేవలం ఢిల్లీ, బీహార్ ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని విడుదల చేసిన బడ్జెట్. ఏపీకి కేటాయించిన నిధులు ఇప్పటికే ఇచ్చినవే..కొత్తగా ఇచ్చినవి ఏమీ లేవు. విశాఖ ఉక్కుకు సంబంధించి, రాజధానికి సంబంధించి ఎటువంటి ప్రస్తావన లేదు. విభజన హామీల అమలుకు నిధుల కేటాయింపులు శూన్యం. ఈ బడ్జెట్‌పై చంద్రబాబు కేంద్రంతో పోరాడతారా లేదా సరిపెట్టుకుంటారా తేల్చుకోవాలి.

– ఎం.ఎల్.నారాయణ, సీపీఐ జిల్లా కార్యదర్శి

రాష్ట్రానికి ప్రయోజనం శూన్యం



కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి తీవ్ర అన్యాయం జరిగింది. రాష్ట్రంలో నూతన ప్రాజెక్టులు నెలకొల్పడం గానీ, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడం కోసం ఎటువంటి చర్యలు తీసుకోలేదు. విభజన చట్టం ప్రకారం ఆంధ్రప్రదేశ్ కు నిధులు కేటాయించలేదు. గ్రామీణ ప్రాంత రైతులకు, రాష్ట్రానికి ఈ బడ్జెట్ వల్ల ఎటువంటి ప్రయోజనం లేదు. వెనుకబడిన ప్రకాశం లాంటి జిల్లాలకు నిధుల కేటాయింపు లేదు. పోలవరం ప్రాజెక్టు ఎత్తు తగ్గించడం అవివేకం.

– డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే

కంటి తుడుపు బడ్జెట్



ఇది కేవలం కంటితుడుపు బడ్జెట్. మధ్య తరగతి వారి ఆదాయం రూ.30 లక్షల పైన ఉన్నప్పుడు, పెద్ద పారిశ్రామికవేత్తల ఆదాయం రూ.కోట్లలో ఉంటుంది. అప్పుడు మధ్య తరగతి వ్యక్తి, పెద్ద పారిశ్రామికవేత్తలు ఇద్దరూ ఒకే రకమైన పన్ను చెల్లిస్తారు. ఆదాయాన్ని బట్టి పన్ను విధించడం మంచి పద్ధతి. పురోగామి పన్ను, ప్రోగ్రెసివ్ టాక్సేషన్ విధానం అనేది అసలు మనదేశంలో లేదు. పురోగామి పన్ను అనేది ఆదాయం పెరిగేకొద్దీ పన్ను పెరగాలి.

– నిర్మలామణి, ప్రొఫెసర్, అర్థశాస్త్రం, ఆంధ్రకేసరి యూనివర్సిటీ, ఒంగోలు.

ఉద్యోగస్తులకు ఊరట



వేతనంపై పన్ను మినహాయింపుతో ఉద్యోగులకు భారీ ఊరట లభించింది. రూ.12 లక్షల ఆదాయం వరకు పన్ను లేకపోవడం ఆపై వేతనాలు ఉన్నా శ్లాబు పద్ధతిలో పన్నులు ఉండటం వల్ల ఉద్యోగులకు దాదాపుగా 40 నుంచి 50 శాతం పన్ను రాయితీ లభించినట్లే. మన రాష్ట్రానికి ఆశించిన మేరకు బడ్జెట్ కేటాయించకపోవడం బాధాకరం.

– చిన్నపురెడ్డి కిరణ్‌కుమార్ రెడ్డి, ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు

మరింతగా సామాజిక అంతరాలను పెంచే బడ్జెట్



కేంద్ర బడ్జెట్ పేదరిక రహిత వికసిత్ భారత్ కోసం కాదు, మరింతగా సామాజిక అంతరాలను పెంచే బడ్జెట్. ముఖ్యంగా విద్య, వైద్యం మరింత కార్పొరేటీకరణ చేసేందుకు ఉపయోగపడుతోంది. సామాజిక వర్గాల సంక్షేమానికి కేవలం రూ.60 వేల కోట్లు కేటాయించడమంటే ఆ వర్గాలను నిర్లక్ష్యం చేయటమే. క్యాన్సర్ తదితర వ్యాధుల మందుల రేట్లు తగ్గించి మిగతావి మరింత ప్రీమియం చేయడం సరైన చర్యకాదు.

– బి.సుబ్బారావు, సీపీఐ ఎంఎల్ రెడ్‌స్టార్ జిల్లా కార్యదర్శి

జిల్లాకు ఎటువంటి కేటాయింపులు లేవు



ప్రకాశం జిల్లాకు కేంద్ర బడ్జెట్‌లో నిధులు కేటాయించకపోవడం దుర్మార్గం. జిల్లాకు తీవ్రంగా అన్యాయం చేశారు. వెనుకబడిన జిల్లాగా ప్రకాశం జిల్లాను గుర్తించినా నిధుల కేటాయింపు లేదు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకొని వచ్చే సవరణ బడ్జెట్‌లో అయినా జిల్లాకు నిధులు కేటాయించేలా చర్యలు తీసుకోవాలి.

– ఎస్.కే.మాబు, సీపీఎం జిల్లా కార్యదర్శి

మానవత్వం మరచి మొండిచేయి

- డయాలసిస్ పేషెంట్లనూ వదలని కూటమి ప్రభుత్వం
- దర్శి నియోజకవర్గంలో 40 మంది డయాలసిస్ పేషెంట్ల పింఛన్ ఎగవేత
- పింఛన్ రాక నానా అగచాట్లు పడుతున్న రోగులు

దర్శి: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి హామీలన్నీ అటకెక్కించింది. కొత్త పింఛన్లు ఇవ్వకపోగా ఉన్నవాటినీ ఏదో ఒక సాకుతో తొలగిస్తోంది. చివరకు కిడ్నీ వ్యాధితో బాధపడుతూ డయాలసిస్ చేయించుకుంటున్న పేషెంట్ల పింఛన్లపైనా మానవత్వం లేకుండా వేటేస్తోంది. కిడ్నీ బాధితులకు నెల నెలా ఇస్తున్న రూ.10 వేలకు కూడా ఎసరు పెడుతోంది. డయాలసిస్ చేయించుకునే కిడ్నీ బాధితులు పడే బాధలు అన్నీ ఇన్నీ కావు. నీరసంగా ఉండి ఏపనీ చేయలేరు. ఒకరి సాయం లేకుండా ప్రయాణాలు చేయలేరు. ఖరీదైన మందులు కొనుగోలు చేయాలన్నా స్తోమత ఉండదు. ఇవన్నీ గమనించిన మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి కిడ్నీ బాధితులను ఆదుకోవాలని డయాలసిస్ చేయించుకునే వారికి నెల నెలా రూ.10 వేలు అందించి అండగా నిలబడ్డారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడు నెలలు దాటినా కొత్తగా ఒక్క డయాలసిస్ పేషెంట్‌కు కూడా పింఛన్ ఇవ్వకపోగా ఉన్న పింఛన్‌లు కూడా పీకేస్తోంది. ప్రాణాలతో పోరాడుతున్న డయాలసిస్ పేషెంట్‌ల కు పలు సాకులు చూపి వాళ్ల నోటి కాడ కూడు లాగేసుకుంటున్నారు. డయాలసిస్ చేయించుకుంటూ పింఛన్‌లు తీసుకుంటున్న పేషెంట్లను గత నెలలో రక్త పరీక్షలు, ధ్రువీకరణ పత్రాలు ఇవ్వాలని సెక్రటరీల ద్వారా ఆదేశించారు. దీంతో వారు వ్యయ ప్రయాసలకోర్చి అందరూ ప్రభుత్వ ఆస్పత్రులకు వెళ్లి పరీక్షలు చేయించుకుని వచ్చిన రిపోర్టులు గ్రామ సెక్రటరీలకు అందజేశారు. ఫిబ్రవరి ఒకటో తేదీ పింఛన్ల కోసం ఆశగా ఎదురు చూస్తున్న వారి ఆశలమీద నీళ్లు చల్లుతూ వారి పింఛన్లు పీకేశారు. దర్శి నియోజకవర్గంలో 40 మందికి పైగా డయాలసిస్ పేషెంట్‌లకు ఈనెల పింఛన్‌లు నిలిపేశారు. దర్శి, కురిచేడు, తాళ్లూరు మండలాల్లో ఒక్కో మండలంలో ఐదుగురి చొప్పున, దొనకొండ మండలంలో 15 మంది, ముండ్లమూరు మండలంలో 10 మందికి పైగా పింఛన్‌లు నిలిపేశారు. గ్రామ కార్యదర్శులు మీకు పింఛన్‌లు రాలేదని, మళ్లీ వెళ్లి ఆస్పత్రిలో చెక్ చేయించుకుని పత్రాలు తేవాలని చావు కబురు చల్లగా చెప్తున్నారు. దీంతో అనారోగ్యంతో బాధపడుతున్న వారు మానసికంగా మరింత కృంగిపోతున్నారు. ఎన్ని సార్లు తిరిగినా పింఛన్లు ఇస్తారా లేక తిరిగి తిరిగి ఉన్న డబ్బు ఖర్చు చేసుకోవాల్సి వస్తోందా అని పింఛన్‌దారులు వాపోతున్నారు. ఇంత దుర్మార్గంగా వ్యవహరిస్తున్న కూటమి తీరును ప్రజలు ఛీదరించుకుంటున్నారు. డయాలసిస్ పేషెంట్‌లకు నెల నెలా వచ్చే పది వేలతోనే ఆరోగ్యం మెరుగ్గా ఉండేందుకు పండ్లు, కాయలు, బలం కోసం వేసుకునే మందులు తీసుకుంటారు. అలాంటిది ఏపనీ చేయలేని తమకు పింఛన్ తీసేస్తే తామెలా బతకాలని డయాలసిస్ పేషెంట్లు ప్రశ్నిస్తున్నారు.

రెండు సార్లు రిపోర్టులు ఇచ్చినా పింఛన్ రాలేదు



నాకు కిడ్నీలు చెడిపోయాయి. డయాలసిస్ చేయించుకుంటున్నా. రెండు నెలలుగా మంచంలో నుంచి లేవడం లేదు. ఇంట్లో వాళ్లు ఆస్పత్రికి రెండు సార్లు తీసుకెళ్లారు. రెండు సార్లు రిపోర్టులు సెక్రటరీకి ఇచ్చాం. ఈ నెలలో పింఛన్ రాలేదని చెప్పారు. మాకు సెంటు పొలం కూడా లేదు. నాభర్త కౌలుకు తీసుకుని పొలం వేస్తుంటారు. కూలిపనులకూ వెళ్తుంటాం. శరీరంలో ఆరుశాతం బ్లడ్ ఉందని వైద్యులు చెప్పారు. మాలాంటి పేదవారికి ఇలా అన్యాయంగా పింఛన్‌లు ఆపడం మంచి పద్ధతి కాదు. గత ప్రభుత్వంలో ఇలాంటి ఆంక్షలు లేవు. సాఫీగా పింఛన్ ఇచ్చేవారు.

– సంఘం కోటేశ్వరమ్మ, కొర్రపాటివారిపాలెం, తాళ్లూరు మండలం

పింఛన్‌లే మాకు జీవనాధారం



నేను గత టీడీపీ ప్రభుత్వం హయాంలో తూర్పు వీరాయపాలెం గ్రామ సర్పంచ్‌గా పని చేశాను. పేద కుటుంబానికి చెందిన వ్యక్తిని అయినా అందరూ ఆదరించారు. కిడ్నీలు చెడిపోయి డయాలసిస్ చేయించుకుంటున్నాను. ప్రభుత్వ ఆస్పత్రిలో చూపించుకుని రిపోర్టులు తేవాలని గ్రామ కార్యదర్శి అడిగారు. ఆరోగ్యం బాగా లేకపోయినా రెండు సార్లు తిరిగాను. రిపోర్టులు ఇచ్చాను. ఈనెల పింఛన్‌లు ఇవ్వలేదు. ఒక రోజు బాగుంటే మరొక రోజు బాగుండటం లేదు. ఎలా బతకాలో నా పరిస్థితి నాకే అర్థం కావడం లేదు. బీసీలమైన మాపై కక్ష్య సాధింపు ఎందుకు.

– పున్నపు అలివేలమ్మ, తూర్పు వీరాయపాలెం, మాజీ సర్పంచ్, దర్శి మండలం

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

● మరో ముగ్గురికి గాయాలు


మృతిచెందిన చెన్నయ్య

రాచర్ల: రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతిచెందిన సంఘటన రాచర్ల మండలంలోని యడవల్లి క్రాస్‌రోడ్డు సమీపంలో శుక్రవారం రాత్రి 9 గంటల సమయంలో చోటుచేసుకుంది. గిద్దలూరు పట్టణానికి చెందిన బెల్లం చెన్నయ్య (56) విజయవాడలో గృహ ప్రవేశానికి వెళ్లి తిరుగు ప్రయాణంలో కారులో వస్తున్న సమయంలో యడవల్లి క్రాస్‌రోడ్డు సమీపంలోని ఇసుక రీచ్ వద్ద ముందు వెళ్తున్న ట్రాక్టర్‌ను ఓవర్‌టేక్ చేయబోయి ఆ ట్రాక్టర్ ట్రాలీని కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారులో ముందువైపు కూర్చుని ఉన్న బెల్లం చెన్నయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. కారులో వెనుకవైపు కూర్చుని ఉన్న బెల్లం రమాదేవికి తీవ్రగాయాలవగా డ్రైవర్‌తో పాటు మరో వ్యక్తికి స్వల్పగాలయ్యాయి. సమాచారం తెలుసుకున్న రాచర్ల ఎస్సై పి.కోటేశ్వరరావు సంఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. క్షతగాత్రులను స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. చెన్నయ్య మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం గిద్దలూరు ఏరియా వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఐదు కోట్ల స్థలం హాంఫట్..!


టీడీపీ నాయకులు అక్రమంగా విక్రయించిన ప్లాటు చుట్టూ ప్రహరీ కోసం కొనుగోలుదారుడు నిర్మించిన పిల్లర్లు

తెలుగు తమ్ముళ్లు పూర్తిగా బరితెగించారు. అధికార పార్టీ అనే అహంకారంతో ఏం చేసినా అడిగేదెవరనే ధీమాతో అవినీతి అక్రమాలకు తెగబడుతున్నారు. ఏకంగా జిల్లా కేంద్రంలోనే విలువైన ప్రభుత్వ స్థలాన్ని కబ్జా చేశారు. రాళ్లు పాతి ప్లాట్లుగా విభజించి అమ్ముకుంటున్నారు. కోట్ల రూపాయల విలువైన ప్రభుత్వ స్థలం ఆక్రమణకు గురైనా రెవెన్యూ అధికారులు ఆ వైపు కన్నెత్తి చూడకపోవడంపై తీవ్రస్థాయిలో విమర్శలు వినిపిస్తున్నాయి. కాసులకు కక్కుర్తిపడి చోద్యం చేస్తున్నారన్న ఆరోపణలున్నాయి. కలెక్టర్, జేసీ, డీఆర్వో వంటి జిల్లాస్థాయి అధికారులతో పాటు క్షేత్రస్థాయి రెవెన్యూ సిబ్బంది వరకు కొలువై ఉండే జిల్లా కేంద్రంలోనే పరిస్థితి ఇంత దారుణంగా ఉంటే.. ఇక మారుమూల ప్రాంతాల్లో ప్రభుత్వ స్థలాలకు దిక్కెవరంటూ ప్రజలు చర్చించుకుంటున్నారు.

- ఒంగోలులో అగ్రహారం గేటు అవతల దత్తాత్రేయకాలనీ ఎదురుగా ప్రభుత్వ స్థలం కబ్జా
- సర్వే నంబర్–81లోని 1.36 ఎకరాలను ఆక్రమించిన టీడీపీ నాయకులు
- యథేచ్ఛగా రాళ్లు పాతుకుని ప్లాట్లు వేసుకుని అమ్ముకుంటున్న వైనం
- జిల్లా కేంద్రంలోనే తెలుగు తమ్ముళ్ల ఇష్టారాజ్యం
- జేబులు నింపుకుంటూ చోద్యం చూస్తున్న రెవెన్యూ అధికారులు

ఒంగోలు సబర్బన్: ఒంగోలు నగరంలో కూటమి ప్రభుత్వానికి చెందిన టీడీపీ నాయకుల తీరు అడ్డగోలుగా ఉంది. చోటామోటా నాయకుని మొదలు పెద్ద స్థాయి నాయకుని వరకు తమకు ఎదురులేదన్నట్లుగా ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. నిత్యం అవినీతి అక్రమాలకు పాల్పడే పనిలోనే ఉంటున్నారు. తాజాగా కలెక్టర్ బంగ్లాకు కిలోమీటరు దూరంలోనే రూ.కోట్ల విలువైన ప్రభుత్వ భూమికి ఎసరు పెట్టారు. టీడీపీ నాయకులే కొలతలు వేసుకుని ప్లాట్లుగా విభజించుకుని కర్రలు పాతారు. ఆ తర్వాత శాశ్వతంగా ఉండేవిధంగా సరిహద్దు రాళ్లు ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఏకంగా బేరం పెట్టి విక్రయించే పనిలో నిమగ్నమయ్యారు. ఈ పనులన్నీ చకచకా చేసుకుంటూ పోతున్నారు. ఇంత జరుగుతున్నా ఒంగోలు రెవెన్యూ అధికారులు మాత్రం ఆ వైపు కన్నెత్తి కూడా చూడలేదు. అంటే.. టీడీపీ నాయకులకు భయపడి పట్టించుకోవడం లేదా.? లేకుంటే ఇప్పటికే జేబులు నింపుకుని నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

మార్కెట్ విలువ దాదాపు రూ.10 కోట్లకుపైనే...

ఒంగోలు నగరంలో అగ్రహారం రైల్వే గేటు దాటగానే బాలాజీనగర్, ఆ తర్వాత దత్తాత్రేయకాలనీ వస్తుంది. దత్తాత్రేయకాలనీ ఎదురుగా సర్వే నంబర్–81లో ప్రభుత్వానికి చెందిన 1.36 ఎకరాల అసైన్‌మెంట్ భూమి ఉంది. ఈ భూమి విలువ ప్రైవేటుకు చెందిన రిజిస్ట్రేషన్ స్థలమైతే మార్కెట్‌లో దాదాపు రూ.10 కోట్లకుపైనే ఉంది. ప్రభుత్వానికి చెందిన అసైన్‌మెంట్ స్థలం కావడంతో ప్రస్తుత మార్కెట్లో ఒక్కో గది రూ.55 వేల నుంచి రూ.70 వేల వరకు ఉంది. దాదాపు 816 గదుల స్థలం కావడంతో సరాసరిన ఒక్కో గదికి రూ.60 వేలు వేసుకున్నా.. సుమారు రూ.5 కోట్లు ఉంటుంది. ఇంత ఖరీదైన ప్రభుత్వ భూమిని యథేచ్ఛగా టీడీపీ నేతలు కబ్జా చేసి మూడునాలుగు రోజులుగా ప్లాట్లు వేసుకుని ఏకంగా పిల్లర్లు వేసి నిర్మాణాలు చేపడుతున్నారంటే.. తెరవెనుక పెద్ద తతంగమే నడిచి ఉంటుందన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

స్థానిక ఎమ్మెల్యే దామచర్ల హస్తం..?

కోట్ల విలువైన ప్రభుత్వ స్థలాన్ని టీడీపీ నాయకులు కబ్జా చేయడం వెనుక ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ హస్తం ఉన్నట్లు తెలుస్తోంది. ఆయనే ప్లాట్లు వేసుకోమన్నాడంటూ ఒంగోలు నగర పాలక సంస్థలోని 16వ డివిజన్‌కు చెందిన టీడీపీ నాయకుడు, స్థానిక కార్పొరేటర్ శ్రీరామ్ నాగభూషణం అండతో తెలుగు తమ్ముళ్లు ప్రభుత్వ స్థలాన్ని కబ్జాచేసి నేరుగా ప్లాట్లు వేసుకున్నట్లు సమాచారం. ఎమ్మెల్యే ప్రమేయం ఉండటంతోనే రెవెన్యూ అధికారులుగానీ, మండల సర్వేయర్‌గానీ, ఒంగోలు నగర పాలక సంస్థ సర్వేయర్‌గానీ కనీసం ఆ వైపు కన్నెత్తి కూడా చూడలేదని తెలుస్తోంది. స్థానికంగా ఉన్న టీడీపీ డివిజన్ అధ్యక్షుడు ఉంగరాల రమణయ్య, ఆ పార్టీ నాయకులు పొదర్తి శింగయ్య, మాదాసు చంద్ర, కర్రి వాసు, సీహెచ్ సురేష్‌తో పాటు మరికొంతమంది కలిసి ప్లాట్లు వేసుకుని అమ్ముకుంటున్నట్లు సమాచారం. మామిడిపాలేనికి చెందిన ఒక పాస్టర్‌కు 50 గదులను ఒక్కో గదిని రూ.60 వేల చొప్పున విక్రయించినట్లు కూడా తెలిసింది. స్థలం కొనుగోలు చేసిన పాస్టర్ ఆగమేఘాలపై పిల్లర్లు వేసేందుకు అవసరమైన బాక్సులు తెప్పించి ఏకంగా స్థలం చుట్టూ ప్రహరీ గోడకు పిల్లర్లు కూడా పూర్తి చేసుకున్నాడు. ఆ పిల్లర్ల మధ్యలో పునాదులు తీసి ప్రహరీ నిర్మించడమే తరువాయి.

> **విచారించి చర్యలు తీసుకుంటాం**
>
> ప్రభుత్వ స్థలాన్ని కబ్జా చేసి నిర్మాణాలు చేపట్టారని సమాచారం అందడంతో కట్టడాలు చేస్తున్న వారిని ప్రశ్నించాను. ప్రభుత్వం నలుగురికి పట్టాలు మంజూరు చేసిందని, ఆ నాలుగు పట్టాలకు సంబంధించిన స్థలంలో చర్చి నిర్మిస్తున్నామని తెలిపారు. దీనిపై పూర్తిస్థాయిలో విచారించి ఉన్నతాధికారులకు తెలియజేస్తా.
>
> – నున్నా సురేష్, వీఆర్‌ఓ, బాలాజీ నగర్

టీడీపీ ప్రభుత్వం వచ్చినప్పుడల్లా ఈ స్థలంపై కన్ను...

2014లో టీడీపీ ప్రభుత్వం వచ్చినప్పుడు కూడా సర్వే నంబర్–81లో స్థలాన్ని కబ్జా చేసి గుడిసెలు కూడా వేశారు. అప్పట్లో ఒంగోలు తహసీల్దార్ చిరంజీవి రంగంలోకి దిగి అక్రమంగా వేసిన గుడిసెలను పూర్తిగా తొలగించారు. ఇది ప్రభుత్వ భూమి అని బోర్డు కూడా పెట్టారు. ఆ తర్వాత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఎవరూ ఆ స్థలం వైపు కన్నెత్తి కూడా చూడలేదు. మళ్లీ టీడీపీ ప్రభుత్వం రాగానే ఆ పార్టీ నాయకుల కళ్లు ఖరీదైన ప్రభుత్వ స్థలంపై పడ్డాయి. ఇంకేముంది.. అనుకున్నదే తడవుగా పాగా వేసేశారు. జేబుల్లో కోట్ల రూపాయలు నింపుకుంటున్నారు.


ఆక్రమిత ప్రభుత్వ స్థలాన్ని ప్లాట్లుగా విభజించి కబ్జాదారులు ఏర్పాటు చేసిన కర్రలు


కబ్జాకు గురైన స్థలంలో ఒక ప్లాటు కొనుగోలు చేసిన వ్యక్తి పిల్లర్లు వేసేందుకు సిద్ధంగా ఉంచిన బాక్సులు


ప్రభుత్వ స్థలంలో బాక్సులు బిగించి పిల్లర్లు పోస్తున్న దృశ్యం

పేద విద్యార్థుల జీవితాలతో కూటమి చెలగాటం


ఫీజు పోరు పోస్టర్లు ఆవిష్కరిస్తున్న వైఎస్సార్ సీపీ ఒంగోలు నియోజకవర్గ ఇన్‌చార్జ్ చుండూరు రవిబాబు, నాయకులు

- ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల పెండింగ్‌తో విద్యార్థులు, తల్లిదండ్రుల ఆందోళన
- కళాశాల యాజమాన్యాలు వేధిస్తున్నా పట్టించుకోని ప్రభుత్వం
- విద్యా వ్యవస్థను నాశనం చేస్తున్న కూటమి పాలకులు
- వైఎస్సార్ సీపీ ఒంగోలు నియోజకవర్గ ఇన్‌చార్జ్ చుండూరు రవిబాబు ధ్వజం
- వైఎస్సార్ సీపీ ఫీజు పోరు కార్యక్రమ పోస్టర్లు ఆవిష్కరణ

ఒంగోలు సిటీ:

పేద విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించకుండా వారి జీవితాలతో కూటమి ప్రభుత్వం చెలగాటమాడుతోందని వైఎస్సార్ సీపీ ఒంగోలు నియోజకవర్గ ఇన్‌చార్జ్ చుండూరు రవిబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో ఈ నెల 5వ తేదీ నిర్వహించనున్న ఫీజు పోరు కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను శనివారం ఒంగోలులోని వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాలయంలో పార్టీ నాయకులతో కలిసి రవిబాబు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రవిబాబు మాట్లాడుతూ ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను కూటమి ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అందుకోసం ఫీజు పోరు పేరుతో వైఎస్సార్ సీపీ నిరసన కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని అమలు చేసి ఎంతో మంది పేద విద్యార్థుల ఉన్నత చదువులకు బాటలు వేశారని కొనియాడారు. తండ్రి ఆశయాలకు అనుగుణంగా అమ్మ ఒడి, ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాలను మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన హయాంలో అందిస్తూ పేద విద్యార్థుల ఉజ్వల భవితకు బాటలు వేశారన్నారు. తన ఐదేళ్ల పరిపాలనలో కళాశాలల యాజమాన్యాలు, తల్లిదండ్రుల ఖాతాల్లో ఫీజు నగదు జమచేశారని గుర్తు చేశారు. జగనన్న పాలనలో విద్యకు అత్యధిక ప్రాధాన్యత ఇచ్చారన్నారు. కానీ, ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ నగదు జమ చేయకపోవడంతో పరీక్షల హాల్ టికెట్లు ఇవ్వకుండా కళాశాలల యాజమాన్యాలు విద్యార్థులకు తీవ్రఇబ్బందులకు గురిచేస్తున్నాయని తెలిపారు. కార్పొరేట్ విద్యాసంస్థలకు కొమ్ముకాస్తున్న కూటమి ప్రభుత్వం .. ప్రభుత్వ విద్యారంగాన్ని నిర్వీర్యం చేసేందుకు కుట్ర పన్నుతోందని విమర్శించారు. కూటమి ప్రభుత్వం ఫీజు బకాయిలను వెంటనే చెల్లించకుంటే తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని రవిబాబు హెచ్చరించారు.

ఇంగ్లిష్ మీడియం రద్దుచేసిన ఘనత సీఎం చంద్రబాబుది...

ఇంగ్లిష్ మీడియం, 3వ తరగతి నుంచి టోఫెల్ సబ్జెక్టు టీచర్లను రద్దు చేసిన ఘనత సీఎం చంద్రబాబుకు దక్కుతుందని చుండూరి రవిబాబు విమర్శించారు. విద్యార్థులకు ఉపయోగపడే ట్యాబులు, బైజూస్ కంటెంట్లు మూలన పడేశారన్నారు. వసతిదీవెన, విద్యాదీవెన లేక విద్యార్థులు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారన్నారు. 2014 నుంచి 2019 మధ్య టీడీపీ పాలనలోని పాత బకాయిలు రూ.29 వేల కోట్లను సైతం వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎం అయిన వెంటనే చెల్లించారన్నారు. ప్రస్తుతం ఉన్న 4 వేల కోట్ల పాత బకాయిలను వెంటనే చెల్లించాలని కూటమి పాలకులను డిమాండ్ చేశారు. దీనికోసం ఈ నెల 5వ తేదీ వైఎస్సార్ సీపీ చేపట్టే ఫీజు పోరు నిరసన కార్యక్రమానికి విద్యార్థులు, తల్లిదండ్రులు, వైఎస్సార్ సీపీ శ్రేణులు, విద్యార్థి సంఘాలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని చుండూరి రవిబాబు పిలుపునిచ్చారు. ఆ రోజు ఉదయం ఒంగోలులోని నెల్లూరు బస్టాండ్ వద్ద గల మున్సిపల్ హైస్కూల్ నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ అనంతరం కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేస్తామన్నారు. వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ ఒంగోలు నగర అధ్యక్షుడు కఠారి శంకరరావు, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు బొట్లా సుబ్బారావు, లీగల్ సెల్ జిల్లా అధ్యక్షుడు నగరికంటి శ్రీనివాసరావు, కార్పొరేటర్లు ఇమ్రాన్‌ఖాన్, ప్రవీణ్‌కుమార్, ఎంపీపీ లంకపోతు అంజిరెడ్డి, స్టూడెంట్ వింగ్ జిల్లా అధ్యక్షుడు పల్నాటి రవీంద్రనాథ్‌రెడ్డి, నియోజకవర్గ యూత్ వింగ్ అధ్యక్షుడు మల్లిశెట్టి శ్రీనివాస అయ్యప్ప, స్టూడెంట్ వింగ్ అధ్యక్షుడు వేమల శ్రీకాంత్, నాయకులు వేణుగోపాల్, మహీంద్ర, సిద్దార్థరెడ్డి, కె.శివారెడ్డి, గోనెల మేరీకుమారి, పేరం ప్రసన్న, బడుగు ఇందిర, వడ్లమూడి వాణి, భూమిరెడ్డి రమణమ్మ, బత్తుల ప్రమీల, కోఆప్షన్ సభ్యులు స్వర్ణ శ్యాంసాగర్, ఆనం శ్రీనివాసరెడ్డి, నాగూర్, కొల్లాం కార్తీక్, కె.కోటియాదవ్, ఏడుకొండలు, మైనార్టీ సెల్ మీరావలి, గోనెల శివకుమార్, పిగిలి శ్రీను, వెంకట నరసింహారావు, దాసరి కరుణాకర్, కమ్మ సురేష్, చిన్న, సన్నీ మోజెస్, పీటర్, తదితరులు పాల్గొన్నారు.

మందకృష్ణ ఫ్లెక్సీ తీసేయించిన టీడీపీ నాయకులు


పంచాయతీ కార్యాలయానికి తరలించిన ఫ్లెక్సీ

టంగుటూరు: ఎమ్మార్పీఎస్ నాయకుడు మందకృష్ణ మాదిగకు పద్మశ్రీ అవార్డు వచ్చిన సందర్భంగా ఆయనకు శుభాకాంక్షలు తెలుపుతూ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకుడు బక్క తిరుమలరావు మాదిగ టంగుటూరు బస్టాండ్‌లో గత బుధవారం ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు. దళిత జాతి నాయకునికి శుభాకాంక్షలు తెలుపుతూ ఫ్లెక్సీ ఏర్పాటు చేయడాన్ని జీర్ణించుకోలేకపోయిన ఆ గ్రామ అగ్రకుల టీడీపీ నాయకులు శనివారం ఆ ఫ్లెక్సీని అక్కడి నుంచి తీసేయించి పంచాయతీ కార్యాలయానికి తరలించారు. దీనిపై భగ్గుమన్న దళిత సంఘాల నాయకులు తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. ఇది దళిత జాతిని అవమానించడమేనని, టంగుటూరు బస్టాండ్ సెంటర్‌లో ధర్నాకు పిలుపునిస్తామని హెచ్చరించారు.

చెరువులో పడి వ్యక్తి మృతి

సీఎస్ పురం (పామూరు): బహిర్భూమికి వెళ్లిన వ్యక్తి ప్రమాదవశాత్తూ చెరువులో పడి మృతిచెందిన సంఘటన శనివారం సీఎస్ పురంలో చోటుచేసుకుంది. సీఎస్ పురంకు చెందిన జగన్నాథం నాగేంద్రబాబు (30) బహిర్భూమికి చెరువు మొదటి తూము వద్దకు వెళ్లాడు. అక్కడ ప్రమాదవశాత్తూ కాలుజారి నీటిలో పడిపోయాడు. సమీపంలో ఉన్న వ్యక్తి ఈ విషయాన్ని గమనించి గ్రామస్తులకు సమాచారం అందించాడు. స్థానికులు చెరువువద్దకు వెళ్లి నాగేంద్రబాబును బయటకుతీసి ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్లు తెలిపారు. బాధిత కుటుంబ సభ్యుల సమాచారం మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌ఓ ప్రసాద్ తెలిపారు. మృతుడికి భార్య జ్యోత్స్న, కుమారుడు, కుమార్తె ఉన్నారు.